క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో శుక్రవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కరరావు గురువారం తెలిపారు. ఎంపీపీ కారే సుధ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11.30 నిమిషాలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు హాజరు కావాలని చైర్‌పర్సన్ పిలుపు నిచ్చారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో కౌన్సిల్ సమావేశానికి రావాలన్నారు.

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

స్వామివార్లకు వెండి కిరీటాల సమర్పణ



వెండి కిరీటం అలంకరణలో స్వామివార్లు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో వేంచేసిన సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములకు భక్తులు గురువారం వెండి కిరీటాలు సమర్పించారు. వరదా చిన బ్రహ్మాజీ దంపతులు రూ.30 వేల విలువైన వెండి కిరీటాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు వాటికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు.

అన్నదానం

కొత్తపల్లి: శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్థానిక ఊరచెరువు ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొత్తపల్లితో పాటు కుతుకుడుమిల్లి, వాకతిప్ప తదితర గ్రామాలకు చెందిన సుమారు 2 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజలకు భారంగా బీజేపీ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

పెద్దాపురం: బీజేపీ ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తోందని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం సీపీఎం మండల విస్తృత సమావేశం డి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగింది. మందులు, టోల్‌ప్లాజా రేట్లను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తోందన్నారు. సమావేశంలో దువ్వా శేషుబాబ్జీ, కరణం ప్రసాదరావు, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, నరసింహమూర్తి, చల్లా విశ్వనాథం, పెంటయ్య, డి.కృష్ణ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



షార్ట్ ఫిలిమ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కల్కి, రమణ

కొత్తపల్లి: స్థానిక తీపిగుర్తులు స్టూడియోలో గురువారం సీఎస్ఎన్ క్రియేషన్ బ్యానర్‌తో నిర్మించిన 'హలో మాస్టార్' షార్ట్ ఫిలిమ్ పోస్టర్‌ను మూవీ ఆర్ట్ అసోసియేషన్ సభ్యుడు పేరూరి కల్కి, జిల్లా తెలికుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పేరూరి రమణ ఆవిష్కరించారు. ఈ షార్ట్ ఫిలిమ్‌లో హీరోగా ప్రకాష్, హీరోయిన్‌గా అనూష నటించగా దర్శకుడిగా సూరాడ ప్రతాప్, ఎడిటర్‌గా చిత్రాడ జగ్గారావు పనిచేస్తున్నట్లు తెలిపారు. కాలానుగుణంగా సాగే ఒక ప్రేమ కథా చిత్రమని, త్వరలో ఆదిత్య మ్యూజికల్ చానల్ ద్వారా విడుదల చేయనున్నట్లు ప్రతాప్ తెలిపారు.



జి. మేడపాడు గ్రామంలో సీతారాములను దర్శించుకున్న దవులూరి దొరబాబు



సామర్లకోట మఠంసెంటర్‌లో సీతారాముల కల్యాణం



సామర్లకోట సీతాఫల వీధిలో సీతారాముల కల్యాణంలో అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, లక్ష్మీనారాయణ



సామర్లకోట మఠం సెంటర్‌లో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

చూసిన కనులకు వైభోగం

- కన్నులపండువగా సీతారాముల కల్యాణం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

శ్రీరామనవమి వేడుకలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో గురువారం కన్నుల పండువగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద పానకాలు పంపిణీ చేశారు.

పిఠాపురం: గ్రామాల్లో సీతారాముల పరిణయ సందడి నెలకొంది. వేదఘోష, రామనామంతో పల్లెలు మార్మోగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు పానకాలు, విసిన కర్రలు, వడపప్పు, పులిహోర పంపిణీ చేశారు. పలుచోట్ల భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు సీతారామల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో వేంచేసిన పురాతన రామాలయంలో వేద పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించారు. ఆలయ అర్చకుడు చక్రవర్తుల అనంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. వందలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వాకతిప్పలోని పద్మశాలి రామాలయంలో చేనేత కార్మికులు, జాందానీ వస్త్ర దుకాణ వ్యాపారులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపారు. ఉప్పాడ, కొమరగిరి, కుతుకుడుమిల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, మూలపేట, యండపల్లి గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాల వద్ద భజనలు, సంకీర్తలు ఆలపించారు.

రసరమ్యం రాములోరి కల్యాణం

సామర్లకోట: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని గురువారం నియోజకవర్గం ఆధ్యాత్మికతతో నిండి పోయింది. పట్టణ, మండల పరిధిలో రామాలయాల్లో కల్యాణాలు నిర్వహించగా భక్తులు తన్మయులై వీక్షించి ప్రసాదం, పానకాలు స్వీకరించారు. వేట్లపాలెంలో వల్లూరి అయ్యన్న చౌదరి, ప్రత్తిపాటి భాస్కరరావు, వంక రామకృష్ణ, మార్ని ప్రసాద్‌ల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మఠం సెంటర్‌లోని రామాలయంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి వారి అమ్మవారి విగ్రహాలను పల్లకిలో గోదావరికి తీసుకువచ్చి స్నానాలు చేయించి గ్రామోత్సవాలు నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపురం రామాలయంలో ఆలయ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించి, అన్నదానం ఏర్పాటు చేశారు. జి.మేడపాడులోని బంటువారి వీధిలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతాఫల వీధిలోని రామాలయంలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గోర్స రామాలయంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అలరించిన కూచిపూడి నృత్యం

స్థానిక వెలమపేట రామాలయం వద్ద గురువారం రాత్రి స్థానిక చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా మదర్‌థెరిస్సా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చిన్నారులను ఘనంగా సత్కరించారు.

బ్రౌన్‌పేటలో వస్త్రదానం, అన్నదానం

స్థానిక బ్రౌన్‌పేట రామాలయం వద్ద గురువారం అన్నదానం, వస్త్రదానం నిర్వహించారు. 4వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాలు కన్నుల పండువగా నిర్వహించారు. మహారాణి సత్రంలో ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించగా హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. భక్తులకు వసనకర్రలు అందజేశారు. అనంతరం దొరబాబు అన్నదానాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే చిన రాజప్ప అన్నదానంలో పాల్గొన్నారు. గోలివారి వీధిలో కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే అల్లక్కి వారి సత్రంలో నవమి వేడుకలను పురస్కరించుకుని 40 మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున వంశపారంపర్య ధర్మకర్త అల్లక్కి కృష్ణ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అలాగే గ్రామీణ మండలం మర్లావలో నవమి వేడుకలను పురస్కరించుకుని ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు.



రామాలయంలో నృత్యం చేస్తున్న చిన్నారులు



గొల్లప్రోలులో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు



వన్నెపూడిలో స్వామివారి కల్యాణం



పేదలకు వస్త్రదానం చేస్తున్న దవులూరి సుబ్బారావు

రిజర్వేషన్ వేళల కుదింపు

- ఒకటో తేదీ నుంచి అమలు
- ఆందోళనలో ప్రయాణికులు
- రేపు ధర్నాకు సమాయత్తం



సామర్లకోట రైల్వే స్టేషన్

సామర్లకోట: రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల పనివేళలు శనివారం నుంచి కుదించడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో అసలే అరకొర సదుపాయాలతో సతమతమవుతున్న ప్రయాణికులు రైల్వే అధికారుల తాజా ఉత్తర్వులతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేసే రిజర్వేషన్ కౌంటర్లు ఏప్రిల్ ఒకటో తేదీ శనివారం నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ డీఆర్ఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు స్థానిక అధికారులు తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సామర్లకోట రైల్వే జంక్షన్ కావడంతో కాకినాడతో పాటు జగ్గంపేట, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు సామర్లకోట వచ్చి ఆయా ప్రాంతాలకు టిక్కెట్లు రిజర్వేషన్లు చేయించుకుంటారు. ప్రస్తుతం ఈ కుదింపుతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి.

రిజర్వేషన్ కౌంటర్ల సమయం పెంచాలి



జిల్లా నలు మూలల నుంచి ఆయా ప్రదేశాలకు రాకపోకలు చేయడానికి సామర్లకోట వచ్చి రిజర్వేషన్లు చేయించుకొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు ఉన్న సమయాన్ని పెంచాలి. రిజర్వేషన్ కౌంటర్ల పనివేళల కుదింపుపై శనివారం రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తాం.

– ఇరుసుమళ్ల సాయి, సామర్లకోట

ఏలూరు, సామర్లకోటలకు కొత్త జీఓ..



ఏలూరు, సామర్లకోట రైల్వే స్టేషన్లలో రిజర్వేషన్ల కౌంటర్ల సమయం కుదిస్తూ విజయవాడ డీఆర్ఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ సమయం అమలులోనికి వస్తుంది. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. నిత్యం రిజర్వేషన్ కౌంటర్లు రద్దీగా ఉంటున్నాయి.

– ఎం రమేష్, రైల్వే స్టేషన్ మేనేజరు, సామర్లకోట

తంటికొండ చైర్మన్ పదవికి రాంబాబు రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఈఓకు అందజేస్తున్న రాంబాబు (రెడ్డి)

గోకవరం: మండలంలోని తంటికొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవికి బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) రాజీనామా చేశారు. ఇటీవల ఆలయంలో పలువురు సిబ్బంది హుండీల్లో భక్తులు వేసిన కానుకల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీటిపై విచారణ నిర్వహించే వరకూ హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించకూడదని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును సైతం అడ్డుకున్నారు. దీనిపై ఎటువంటి విచారణ నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఈఓ ఆర్‌వీ చందనకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్ హోదాలో ఆయన సిబ్బంది విధులకు తరచూ ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఆయన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ఆయన రాజీనామా పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

తుని: ప్రస్తుత వేసవిలో రైళ్లలో ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు జీఆర్పీ కాకినాడ లైన్స్ రైల్వే ఇన్‌స్పెక్టర్ డి.రామారావు అన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో గురువారం జీఆర్పీ పోలీసులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భద్రతతో పాటు దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠగా లారీ యజమానుల సంఘం ఎన్నికలు



బ్యాలెట్ బాక్సుకు సీల్ వేస్తున్న నాయకులు

సామర్లకోట: స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక ఉత్కంఠగా సాగింది. 2013 నుంచి ఎన్నికలు జరుగకపోవడంతో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి గురువారం ఎన్నికలు నిర్వహించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి యూనియన్ సభ్యులు రెండు వర్గాలుగా పోటీకి సిద్ధమయ్యారు. సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్సై సీహెచ్ గోపాలకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం, 10 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది. లారీ సంఖ్యను బట్టి ఓట్లు ఇచ్చారు. లారీ యూనియన్ కార్యాలయ పరిధిలో 358 లారీలు ఉండగా 227 మంది యజమానులు ఉన్నారు. జిల్లా లారీ ఓనర్స్ అసోసియన్ అధ్యక్షుడు డి.నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అభ్యర్థుల ఎదురుగా బ్యాలెట్ బాక్సును సీలు వేశారు. అధ్యక్ష పదవికి యూనియన్ మాజీ అధ్యక్షుడు ముత్యం రాజబాబు, పబ్బినీడి దుర్గాప్రసాద్ పోటీ పడ్డారు. 29వ వార్డు కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18 లారీలు ఉన్న కర్రి శివప్రసాద్ తన ఓట్లను విని యోగించుకున్నారు. పోలీసు బందోబస్తుతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



పబ్బినీడి దుర్గాప్రసాద్

ఉత్కంఠగా సాగిన లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలల్లో పబ్బినీడి దుర్గాప్రసాద్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. యూనియన్‌లో 358 ఓట్లకు 353 ఓట్లు పోలైనట్టు అసోసియేషన్ అధ్యక్షుడు డి నాగరాజు తెలిపారు. మూడు ఓట్లను తిరస్కరించారు. ముత్యం రాజబాబుకు 140 ఓట్లు రాగా, పబ్బినీడి దుర్గాప్రసాద్‌కు 210 ఓట్లు రావడంతో 70 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

ఎడ్ల పరుగుపందెం విజేత గోనేడ



ఎడ్ల బళ్ల పందెం విజేతలకు బహుమతులు అందజేస్తున్న దొరబాబు

పెద్దాపురం: మండలంలోని మర్లావ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు హోరాహోరీగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు పది ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. మర్లావ నుంచి వీరవరం వెళ్ళే పుంత రహదారిలో నిర్వహించిన ఈ పోటీల్లో కిర్లంపూడి మండలం గోనేడకు చెందిన గోలి శివలక్ష్మి ఎడ్లు ప్రథమ స్థానం సాధించగా వల్లూరి బుదిరెడ్ల చక్రధరరావు (మర్లావ) ద్వితీయ, పంది చంటిబాబు (మర్లావ) తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాన సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా బహుమతులు అందజేశారు. గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, ఆకుల వీరబాబు, కామన రామకృష్ణ, కాతా పెద్దకాపు, నరాలశెట్టి త్రినాథ్, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, వైవీకే సాయి పాల్గొన్నారు.

ఉక్కు పోరాటానికి 700 రోజులు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆందోళన 700 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ ఒకటో తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. గురువారం సీఐటీయూ కార్యాలయంలో కార్మికసంఘాల ప్రతినిధులు సమావేశమై విశాఖ ప్లాంట్‌కు గుండెకాయలాంటి బ్లాస్ట్‌ఫర్నేస్-3ని 14 నెలల నుంచి మూసివేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను దొడ్డిదారిన బలహీన పర్చడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఒక్కదానికే రైల్వేర్యాక్‌లు కూడా ఇవ్వకుండా కేంద్రం అడ్డుపడుతుందన్నారు. 2017 నుంచి సిబ్బందికి జీతాలు, పదోన్నతులు నిలిపివేశారని వారు పేర్కొన్నారు. ప్లాంటును నష్టాల్లో చూపించి త్వరగా పోస్కో కంపెనీకి కార్పొరేట్లకు విక్రయించాలని కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. తక్షణమే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికవర్గం, రైతులు, ప్రజాసంఘాలు, ప్రజలు వర్తక వ్యాపార వర్గాలు తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారం పూలే విగ్రహం వద్ద చేసే ధర్నాలో కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

సగ్గుబియ్యం ఫ్యాక్టరీలో తనిఖీలు

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో సగ్గుబియ్యం పరిశ్రమను ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీపై ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. వివరాలు తెలపడానికి అధికారులు విముఖత చూపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు అన్నవరం నమూనా ఆలయం వద్ద వద్ద వ్యాన్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..గొల్లప్రోలుకు చెందిన జల్లిగంపల వెంకటరావు (42) ఈ నెల 29న వ్యాపార పని నిమిత్తం తుని వెళ్లాడు. పని ముగించుకుని తుని నుంచి గొల్లప్రోలు తిరిగి బైకుపై వెళ్తుండగా అన్నవరం నమూనా టెంపుల్ సెంటర్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరావును కుటుంబ సభ్యులు, స్థానికులు 108 అంబులెన్స్‌పై తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంకటరావు సోదరుడు శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ వివరించారు.

తంటికొండ వెంకన్నకు రూ.8.34 లక్షల ఆదాయం

గోకవరం: మండలంలోని తంటికొండ వేంటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. ఆలయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ నిర్వహించిన తరువాతే హుండీ ఆదాయం లెక్కించాలని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును దేవస్థానం చైర్మన్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో భక్తులు, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. మొత్తం ఆరు నెలల కాలానికి హుండీల ద్వారా రూ.8,03,313 ఆదాయం వచ్చింది. గతంలో ఆలయ ప్రాంగణంలో శీలు వేసిన పరకామణి హుండీ లెక్కించగా రూ.31,362 ఆదాయం వచ్చింది. మొత్తం హుండీల ద్వారా రూ.8,34,675 ఆదాయం వచ్చిందని, గతంతో పోల్చితే ఆదాయం పెరిగిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు నాగసురేష్, తదితరులు పాల్గొన్నారు.